మేలు మరువని కన్నీరు

కవికొండల వేంకటరావు

గోదావరిమీద సూర్యాస్తమానము అపురూపంగా నిజంగా ప్రకృతీ పురుషుల అభేద స్వరూపాలయి ఆవరించవే తాండవిస్తూ వున్నట్టుగా వుంటుంది దృశ్యం. చెట్ల యొక్క పచ్చందనంలో కలిసిపోయినవాడై క్రిందికి దిగిపోతూ వున్నాడా పరబ్రహ్మస్వరూపు డా సూర్యభగవానుడు అన్నట్టు అతి ప్రశాంతంగా అగుపిస్తూ వుంటుంది ఎర్రని తేజోగోళం.

ఆ వేళకు ఈ దరిన్నీ, అంత ప్రశాంత స్థాయినీ అనుభవించ డానికి సంసిద్ధమై యుంటుంది కూడాను. రాచారి పడవలన్నీ వెళ్లి పోతాయి. ఒకటీ వుండదు. వాటితోపాటు మోటబిళ్లూ, కూలిబిళ్లూ, జంతికలూ, జంగాలూ అంతా మటుమాయమైపోతారు. వచ్చేసే స్టీమర్లు వచ్చేసేసి జనాన్ని అప్పటికప్పుడే దింపేసేసి నిప్పు చల్లారి, నిమ్ముకు నీరోసినట్టు కూత కూడా మఱచిపోయి వుండిపోతాయి.

అటువంటి మహత్తర ప్రశాంత భావమప్పుడు, ఒక రేవులో ఒక చోట, ఒకరికొకరు అనతి దూరంగా వుంటి. ఒక పడవతో, ఒక జడ పదార్థంతో ముగ్గురు జనం కనిపించారు. పడవ అన్నది గేదె. నల్లని పెద్ద గేదె. ఆ గేదెను నీటిలో కదుగుతూ వున్నాడు దానితో సమానమైన నల్లని శరీరచ్ఛాయ గలవాడై యొకానొక గొల్లవాడు. జడపదార్థ మన్నది ఒక పాత మట్టికుండ. అదీ నల్లగా వుంటి నీట ముంచబడుతూ వుంది ఒకానొక హరిజన స్త్రీచే. హరిజన స్త్రీ కూడా తాను ముంచే కుండ రంగు కేమాత్రం తీసిపోని శరీరచ్ఛాయగలిగినదై యుండడమేకాకుండా అరవై ఐదేళ్ల వయస్సుగల ముదుసలి మనిషి కూడా అయివుంది. మరి

మూడోవ్యక్తి బ్రాహ్మణోత్తముడు. ఇరవై యేళ్లుంటాయి. పచ్చని శరీరం. తెల్లని జన్నిదాలు మెరసేటట్టు సదురుకుని, ఉత్తరీయం నడుముకు కట్టుకుని, అతగాడు మోకాటిబంటి నీట సూర్యుని కెదురుగా నిలుచుండి సంధ్యావందనం గావిస్తూ వున్నాడు.

యథాతథంగా తెలియచేదామని పై వర్ణన గావించేనేగాని యథార్థం తలపోసి చూస్తే అస్తమయ కాంతిలో సవర్ణులూ అవర్ణులూ అందరూ వొకటే.

ఆ గొల్లవాడు గేదెమీద నీళ్లుపోసి, పట్టిగడ్డి రవ్వంత తెచ్చుకున్న దెక్కడిదో పుచ్చుకుని తోముతూ వున్నాడు. గొడ్డు మకిలి పోయేటట్టు. ఈ హరిజన స్త్రీ కుండముంచి పై కెత్తుకోలేక కుండ మోకాలిచిప్ప ఎత్తు కెత్తుకున్నదై దిక్కులు కలయచూస్తూ వుంది. బ్రాహ్మణోత్తముడు "ఆసావాఽదిత్యో బ్రహ్మ" అని ప్రదక్షిణంగా తిరుగుతూ చుట్టూ నీళ్లు వదుల్తూ వున్నాడు. సూర్య భగవానుడు గ్రుంకొంచెం దిగిపోయేడు పడమటిదెస.

"ఓ సూర్యభగవానుడా! నా కీ బరువు కుండ కొంచెం పైకి నెత్తిమీదికి లేవనెత్తకుండానే క్రుంకిపోతావా?" అన్నట్టు జాలిచూపులు చూచింది హరిజన స్త్రీ. గొల్లవాడూరికే ఆలాగే తన గేదెను తోముతున్నాడు గాని ఆ బలహీనురాలి దైన్యావస్థను తెలిసికొని యుండలేదు; కాని బ్రాహ్మణోత్తముడు తన ప్రదక్షిణంలో అవగాహన గలవాడై దయఅన్నదే మతం, పరోపకారమన్నదే సంధ్యావందనం, అని లోలో నిశ్చయించుకొని తన సంధ్యావందనంలో తాను తన చుట్టూ తిప్పికొన్న చేయిని కొంచెం చాపి ఆ హరిజన స్త్రీ యెత్తుకొనే నీటికుండమీద ఆంచి ఆ బరువు దాని తలకెత్తి "ముసిలీ! జాగ్రత్తగా గట్టెక్కు! పడిపోతివా కుండా నీవూ కూడా అజామత్" అన్నాడు.

ముసిల్ది "ఇప్పుడిప్పుడే సావసులే బాబా! మీరు బామ్మల్లా? మీ పేరు?" అని అడిగింది. గొల్లవాడు "పోవే! నీ కెక్కడలేని వాకబూ కావాలి! ఆయనేదో కనికరించి కాస్తంత కుండెత్తితే ఆరిపేరూ, పూరూ అన్నీ తిదోర నచ్చత్రా లడిగినట్టు అడుగుతున్నావు. ఆరేం, నీవిచ్చే పొత్తర్లడతారనుకున్నావా? నీ యింటి కొచ్చేరనుకున్నావా?" అని కసిరేడు. ముసలది వెళ్లిపోయింది.

బ్రాహ్మణుడు గొల్లవానితో "అలా కసరడమెందుకు దాన్ని. అదీ మనిషే చూడూ! ఏదో వింతకొద్దీ అడిగి వుంటుంది పాపం! నీవన్న మాటలకు దాని మనస్సెంత నొచ్చి వుంటుందో?" అన్నాడు. గొల్లవాడు బ్రాహ్మణునితో "కాదండీ! మటి మీరు మా యిళ్లకు పొత్తర్ల కొచ్చినట్లు వాళ్ల యిళ్లకు వెడతారా?" అన్నాడు. "దానికి యిల్లంటూవుంటే వెళ్లినా తప్పులేదు. నీకు నీ యిల్లెలాంటిదో దానికి దాని యిల్లూ అలాంటిదే. నీ యింటికి అంతా పదిమందీ బ్రాహ్మలూ, ఆప్తులూ, చుట్టాలూ, పక్కాలూ అందరూ రావాలని ఏలా నీ వనుకుంటావో అదీ అలాగే అనుకొంటూ వుంటుంది" అని అన్నాడు బ్రాహ్మణుడు. "ఇంతకూ దానికి ఇల్లు లేదు లెండి! మీరన్నట్లు—అనుకోవడానికి—" అంటూ గేదెను గట్టెక్కించి తాను కాళ్లు నీళ్ళల్లో ఝాడించుకొని గొల్లడు వెళ్లిపోయినాడు.

ఒక దశ దాటే వరకూ, ఆ హరిజన స్త్రీ గాని, ఆ గొల్లవాడు గాని, ఆ విప్రుడు గాని ఒకరి నొకరు మళ్ళీ కలుసుకొనేలేదు. ఇంతకూ ఒకవేళ కలుసుకున్నా వాళ్లూవాళ్లూ పరస్పరావలోకనం గలగజేసుకొని పలకరించుకో వలసినంతటి ప్రత్యేక పరిస్థితు లెట్టివిన్నీ కలిగి యుండ లేదు. అంతేగా సర్వసామాన్య జీవిత రహస్యము. మనం రోజూ బజార్లో కూర కొంటాము. ఆ కూర లంగడివాడే వేరే ఎక్కడో కనబడతాడు. మన కేంపని వాణ్ణి పలకరించడానికి? మంగలివాడు యింటికి వచ్చి క్షౌరం చేసిపోతాడు. ఆ మంగలివాడే ఎక్కడో వీధిలో పోతూ కనబడ

తాడు. మనకేంపని వాణ్ణి పలకరించడానికి ? ఆ వేళ ఏదోతోచి కాస్తంత ఆ హరిజన జరతకు తోడయ్యేడేగాని ఆ బ్రాహ్మణుడు మళ్లీ అది కన బడితే పలకరించవలసిన జరుగుబేమున్నది అతగాడికి ? గొల్లవాని మాటా అంతే ! ఏదో తనకు దోచి ఆనాడు ఆ ముసలిదాన్ని తాను మంచలించాడే గాని మళ్లీ నాని యూసు అతడిక్కావాలా ?

ఇలాగ్గా ఒక దశ వెళ్ళిపోయింది. దశ అంటే పదేళ్లు. పదేళ్లు దేశనాయకులకు గడిస్తే వారి ఆత్మచరిత్రల్లో వంద పుటల సమాచార మెక్కుతుంది. చరిత్రకారుని దేశచరిత్ర మరి మూడువందల పుటల నంజాయిషీతో ఉబ్బిపోతుంది. కాని సామాన్యజనుల జీవితాల్లో ఒక్కొక్కప్పుడు చెప్పుకోదగ్గ వొక్క విశేషమున్నూ ఉండకపోవచ్చు. అయితే అటువంటి వాళ్లను భగవంతుడు ఎందుకు నిర్మాణం చేస్తూవుంటాడో మరి ? అందులోనూ బాగా లెక్కించిచూస్తే కోటిమందికీ ఒక్క పురుషుడు వీరనాయకుడైనట్టు వినబడుతూవుంటాడే, తక్కినవాళ్ల జీవితాలన్నీ విస్మృతాలేనా ? కావు ! కావు ! ఆ జీవితాలను చూడవలసిన దృక్పథం వేఱు. వాళ్లయొక్క సర్వసామాన్య నిత్యజీవనసరళియే ఒక వ్యంగ్యం ! అదే ఒక మహదాశయం ! అదే ఒక రూపం ! అదే ఒకదీపం !

మీ కుదాహరణకావాలి అంటే యీకథలోని ముగ్గురు జనంలోనూ మిక్కిలీ నికృష్టురాలిగా దోచే వృద్ధ హరిజన స్త్రీయొక్క సర్వసామాన్య నిత్యజీవనసరళి ఏమిటో దిఙ్మాత్రంగా సూచిస్తాను. చూతురుగాక !

దాని కులం ఏమిటో ఎవరికీ తెలియదు. అడిగితేమాత్రం చెప్పరాని దాన్ని అని అది తనంతనే కొంచె మసుకుంటా తొలగిపోతూవుంటుంది. దానికి యిల్లూ వాకిలీ, తల్లీ తోడూ, ఎవళ్ళూవున్నట్టు తోచదు. పట్నానికి దక్షిణపు తెరపినివున్న స్మశానం ఆ చాయల ఒక రావిచెట్టు నీడపట్టునున్నగా తుడుచుకొని, అక్కడే రెండు కుండలూ అదీ కాపరం. చెట్టుకో తాటాకు గొడుగు వ్రేలాడదీసికొన్నదే అమెకు సరంబీ సౌలభ్యం. దానికి

జీవనాధారాలు ఏరుబిడకలు. అవి యేరుకొని, వాటి సమ్ముకుని రోజూ ఒక అణాడబ్బులు సంపాదించుకుంటుంది. ఆ అణాడబ్బుల్తోనూ గంజీ, నంజుడూ, వుప్పూ, పర్రా, అన్నీ సంబాళించుకుంటుంది. ఎప్పుడన్నా బమారితే కోమటి కొట్టుకెళ్ళి ఏగాణీ కందిపప్పు తెచ్చుకొని మెత్తగా కాటుకలా వండుకుతింటుంది. అదే పబ్బంపప్పు దానికి. రెండోవాళ్ళ జోలీసొంటూ దానికక్కరలేదు. పైపెచ్చు తన బ్రతుకు పంథానే ఆర్థిక సూత్రాలు, సాంఘికసూత్రాలు, రాజకీయసూత్రాలు, అన్నీ యిమిడివున్నా యని యుద్ఘోషిస్తూవుంటుంది. ఎవరైనా ప్రశ్నిస్తే 'పెట్టుబడికి డబ్బెక్కడి దండీ నాకు? అంచేత పెట్టుబడి అవసరంలేని యీ ఏరుబిడకల్తో వ్యాపారం గావిస్తూవున్నాను' అంటుంది. 'అంటిపెట్టు కూడా వచ్చే వాడెవడు? చెప్పండీ, యీ జీవం కాస్తాపోతే. అంచేత సంఘంతో సంబంధం పూర్తిగా విసర్జించేశా' నంటుంది. 'రాజులు దిగి, రాజులు సింహాసనా లెక్కినా, నా మర్యాద నేనే కాపాడుకోవాలి గాని, ఒక్కడూ వచ్చి కాపాడలేడుగదా' అని జవాబుయిస్తుంది. 'మరి స్మశానంలో మనుష్యుల కొవ్వుగుండి వెలుగుతూవుండేకంటె ఎక్కువ జ్యోతి ఏముంది కనుక- మరి తకరకాలుగా ఈ ఆరుబయట గోదావరి గాలి వీస్తూంటే- యింతకంటె ప్రాణాల్ని నిలిపే యుపాయశాలి మరెవ్వరున్నారు?' అని ఊరికే తనచుట్టూమూగే విద్యార్థులకు, సన్యాసులకు బోధచేస్తూవుంటుంది.

ఆలా రెండు మూడు దశలు మనం వినకుండానే, మనం కనకుండానే, నిరాటంకంగా వెళ్ళిపోయినాయి. ఆ హరిజన స్త్రీని మనం విన్నాక మరో దశ గడచింది.

పై ముగ్గురు జనాన్నీ కూడా మనం ఈ పాటికి మఱచిపోయినామన్నా గాని అతిశయోక్తి కానేరదు—

ఒకానొక రోజున అపరాహ్నం నాల్గింటికి బ్రాహ్మణ వీధిని బ్రాహ్మణుడొకడు కాలంచేసినాడు. కాలగర్భు లందర్నీ సర్వసాధారణంగా

రెండు రకాలవాళ్లుగా గుర్తించొచ్చు. సకాలంలో పోయినవాళ్లనీ, అకాలంలో పోయినవాళ్లనీ. ఇతడు అకాలంలో పోయిన మనిషి క్రింద్కి వచ్చి తన యింటిల్లిపాదికే కాకుండా ఇరుగుపొరుగు వాళ్ళకూడా దుఃఖం కలిగించాడు. అయినా గాని అంత్యక్రియ తప్పదుగా ఎటువంటి వానికీ! అయిదుగంటల కన్నీ సంసిద్ధంచేసి, నగరమమ్మట మోసి మోసి దక్షిణ స్మశానముకుగాను గట్టు దిగారు ప్రజలు.

వారు గట్టు దిగీ దిగడంలో పడమటి గాలి అదివరకే గోదావరి లంకలమీది యిసుక రేగ్గొడుతూవున్నదల్లా నీళ్ళుదాటి యీవల బియ్యపు రంయిని మేఘంతో కూడా వీవదొడగింది. అయినా శవదహనం తప్పదు గదా! కొందరు కొందరు, కూడా ఉన్నవాళ్ళు వెనక్కుతగ్గినా, వాహకులు, అగ్నిహోత్రధారి, ఇలాంటివాళ్ళు దహన సంస్కారం పూర్తి అయ్యే పర్యంతం ఉండవలసిందేగా! చేరువలోనే అంటించేసి పోదామని కటుకు దింపేరు అక్కడే. కాని అప్పటికప్పుడే మేఘం కారు కమ్ముకుపోతూంది. దూరాన్ని అప్పుడే వాన ప్రారంభించిన సూచనగా చల్లని గాలి అందరి మొగాలమీదికీ వీస్తూవుంది. తక్కిన బ్రాహ్మలందరూ కూడా వాన రాకుండావుంటే బాగుండును వో ఘడియ అని దేవుణ్ణి ప్రార్థించడంతోపాటు, పుల్లా పుడుకా పేర్చి కాడు అమర్చి తరువాయి సంగతి వాహకుల్నీ వాళ్ళనీ చూచుకోమని వెళ్ళిపోయినారు. పెద్ద ఉసిరికాయంత చినుకుతో ఆరంభించి ఫెడీ ఫెడీ నాలుగు చినుకులు కొట్టే సరికి వాహకుల్లో 'ఇద్దరు మనమంతా యిక్కడవుండి మిడికేదేముంది? అందరూ చావాలా, చచ్చినవానితోపాటు? మీఱిద్దరూ వుండి చావండి' అన్నారు. రెండోజత వాహకులు 'పేర్చింది పేర్చనే పేర్చాం: నిప్పుంటించండి,' అని అగ్గిపట్టిన అతణ్ణి పురిగొల్పి, మొదటి ఇద్దరి వాహకుల కంటె ముందడుగ్గా బయలుదేరారు. మొత్తం మీద ఆ వాహకులు నలుగురూ కూడా వెంటనే వెనక్కు చూడకుండా వెళ్ళిపోయినారు.

పెద్ద పుసిరికా యంత చిసుకు రాచపుసిరికా యంతలోకి తరిగి, మరి అక్కడనుంచి ముత్యాలుగా మారి హోరున కురుస్తూంటే ఇకక్కడున్నది పుల్లలు మోసుకొచ్చిన చాకలి. ఆ అగ్గి ముట్టించిన వారసు—చాకలివాడు బహుశా తగులడగా మిగిలినకర్రలు పట్టుకుపోడానికి, వారసు బహుశా మరి బతికిరాకుండా పూర్తిగా తగులబడి పోయింది కష్టె అని నిర్ధారించుకోవడానికీ అక్కడ పుండిపుంటారు అని మనం అనుకొన్నా తప్పులేదు.

లోకంలో అంత స్వార్థం పుంది—

లోకంలో అంత వ్యాపార ప్రవృత్తి బలిసింది—

కాని దేవుని యుద్యమం వేరు. ఎక్కడెక్కడికి ఎవళ్లెవళ్లు చేర వలసి పుంటుందో అంతవరకూ ఆలా నిలుపుతూనే పుంటాడు కష్టెను. కష్టె! దానిమీద అంత వ్యామోహం! ఎందుకూ అంటారేమో పాఠకులు— అదేగా, యీ వివిధ విచిత్రాలకూ తావిచ్చేది. ఒకదానివంటి కష్టె మరొక్కటి కానవస్తుందా? కాబట్టి దానియొక్క కడసారి కళ కళ్లార చూడవలసిందే. దానియొక్క కడాపటి ప్రభ మనసార సంస్మరింప వలసిందే!

జోరుగా వర్షం కురుస్తూ పుంది. మేఘం ఇంకా దళంగా అల ముకుపోతూ పుంది. గొడుగు లేదు. అదున్నా కొంతమెరుగే. చాకలిన్నీ వారసున్నూ అటూ ఇటూ చూచేరు. మరోగడియ పుంటే ఆ బయలంతా నీటి వెల్లువగా పొర్లెక్కి తెప్పానాం తేలానాంగా మారిపోతుందేమో క్రూడాను. మరి మానవరూపాలు ద్యోతకం కావడంలేదు. అయినా కేకేదో వినిపిస్తూ పుంది.

గొల్లవాడు! మన గొల్లవాడు! వాని గేదె రెల్లుదుబ్బుల్లో దారి తప్పి ఆ హోరు వానలో వానికి దొరక్క, తిప్పలు పెడుతూవుంది. వాడొకడు అంత వానలోనూ, సాయంత్రం పాలు పితికేవేళ దాటిపోతూ

వుంది అని గేదెను పిలుస్తూ మళ్లేస్తూవున్నాడు. ఎలాగైతేం గొల్లవానికి గేదె దొరికింది. దాని మెడకు కన్నె తగిల్చి తనతో కూడా ఆ విసురు ముసుర్లో ఆ రుద్రభూమిని లాక్కువస్తున్నాడు. ఆ గొల్లవానికి దారిలో దసులయ్యింది పై శవదహన దృశ్యం!

కొత్తగా వానలో తడిసి బాధపడ్డమనేది గడ్డుగాని, అదివరకే తాను తడిసిపోయి వణుకుతూన్న వాడవడంచేత, వాని కష్టంలాంటిదే అని గొల్లవాడా వణకుతూ నిలబడ్డ తక్కిన ఇద్దటి మనుష్యుల్నీ, ఆ కట్టెనూ పోల్చి, గేదె సమేతంగా ఆగి, పరకాయించాడు. 'వాన తగ్గిపోతుంది గాని బాబుల్లారా! మరి యీ పుల్లలు, పిడక లుంటేనేగాని అంటుకోవు.' అని 'కాష్టంతగులడే అదృష్టంకూడాలేని యీ ప్రేత ఎవరా' అన్నట్లు చూచాడు ఉత్తి బొందికేసి. చూచివారితో ఏమీ విశేషం మాటాడకుండా, చాకలితో ఆ గేదెను పట్టుకోమని- "మీక్కావలిస్తే ఆ రావిచెట్టు క్రింద మాలదానిదగ్గర ఎండు ఏరుబిడకలు తీసికొస్తాను" అన్నాడు.

వారసు "అది డబ్బులడుగుతుందేమో?" అన్నాడు. "అడిగితే రేపివ్వచ్చునులెండి" అని గొల్లడు ఈ కథకంతకూ ముఖ్యపాత్ర అయిన హరిజన స్త్రీకడకు వెళ్ళినాడు. ముసలిమాలెత అప్పటికప్పుడే తన ఏరుపిడకలన్నీ ఓ కుండలో, నీళ్లు వొలకపోసి, ఆ కుండలోతు చెయ్యెట్టి తుడిచివేసి అందులో పడవేసిందై, చెట్టునున్న గొడుగు కుండ మీద బోర్లించి ఆ పక్కనే కూర్చుని వణుకుతూవుంది.

"చూడు ముసలీ!" అన్నాడు గొల్లవాడు. "ఏం బాబా! నా అవసరం ఏమొచ్చింది?" అంది ముసల్ది. "చూడు పదేళ్లక్రిందట నీకు గోదావరిలో కడవెత్తిన బాపనయ్య ఈ రోజున కాలంచేసినాడు పాపం!" అన్నాడు గొల్లడు. "ఆఁ! ఆఁ! నా కళ్లముందే? అయ్యో, నాతండ్రీ!" అంది విస్తుపోతో విలపిస్తూ అది. "చూడు" అన్నాడు గొల్లడు. "నీకు రేపిస్తారుగాని కాణీ" అని కూడా వెంటవెంటనే వక్కాణించాడతడు.

ముసల్దాని కప్పుడే అర్థమయిపోయిందంతాను. "అక్కర్లేదు! నాయనా! నాకు డబ్బులొద్దు బాబా! ఇందాకట్నుంచీ కనిపెడుతూనే ఉన్నాను. వాళ్లేనా నాయనా వాళ్లు?" అంది. "అవును, వాళ్లే! నీ ఎండుపిడకలు కొన్ని వాళ్ళకందియ్యాలి!" అన్నాడు. "అదే నేననుకుంటూన్నదీని" అని వెంటనే కుండెడు ఏరుపిడకలూ గొడుగు బోర్లింపుతో సహా నెత్తి నెట్టుకొని నడచివెళ్లింది గొల్లనితో మాతంగి ముదుక.

అంతదూరాన్ని దించింది కుండా గొడుగూ- చాకలి "యీ వాన కాళ్ల చాలకనా తల్లీ! కుండతో నీళ్ళు మోసుకొచ్చావు" అన్నాడు. గొల్లడు తన గేదెను చాకలినుంచి అందిపుచ్చుకుంటూ "ఆ కుండలోనివి నీళ్ళుకావు. ఏరుపిడకలు" అన్నాడు.

పెద్దవర్షం తగ్గి కాస్తోకూస్తో ఆకేసి, తెరపిచ్చి, వాలిన ఆకాశాన్న సూర్యాస్తమానం ఇంకా ఉన్నానంటూవుంది. కాని నెత్తిమీద మేఘం మేఘంలాగేవుండి, బిందిస్తూనేవుంది ఇంకా.

ముసల్ది "గొల్లబోయిడా! వారితో ఈ గొడుగు ఆ తలకేసి చాపెట్టి ఈ పిడకలు పేర్చి అంటించమను. చమురున్న వొత్తైతే ఎంతోసేపా దీపించడం?" అంది. అంటూనే కళ్ళమ్మట నీళ్లెట్టుకుని "నా తండ్రికి చమురుండకపోవడ మేమి? మంచి నడికాలపు మనిషి?" అని- నిజంగా చెబితే నమ్ముతారో నమ్మరో పెద్దపెట్టున ఏడ్చింది.

గొల్లబోయడు నిర్విణ్ణుడైపోయినాడు. చాకలి మాలదాని తాటాకు గొడుగు అంది పుచ్చుకొని ఆ విప్రశవానికి శిరంవెంపు చాటుగా పట్టుకొన్నాడు. వారసు అనే అతడు తన చేతిలోనికి ముసిల్ది కుండలోంచి తీసి అంతదూరాన్నుంచి విసరుతూవుంటే గొడుగుచాటునే కూర్చుండి ఏరుపిడక లందిపుచ్చుకుంటూ, పేర్చి దహనసంస్కారం గావించాడు.

కాష్ఠపుమంటను చూస్తూ ముసల్ది "ఆ సూర్యనారాయణమూర్తి కంటే తేజశ్శాలి నాతండ్రీ!" అని అనుకొని తక్కిన వాళ్లంతా వెళ్ళి

పోయినదాకా నిల్చి, ఇంకా మిక్కిలి విస్మరించిం దీలా: "నా తండ్రి
నేనడగనేలేదు. నే నెత్తమనేలేదు. ఆలా జపం చేసుకొంటూపున్నా ఆయన
నా కష్టం కనిపెట్టి, ఆలా తనచెయ్యి నా కడవమీద అంచి నిండుకుండ
నెత్తికెత్తాడు. ఇప్పు డెవరెత్తుతారు ? ఇప్పు డెవరెత్తుతారు ?" అని వాన
చినుకులో కన్నీళ్ళో ఏర్పరుపరాకుండా పూరింపుగన్న తన పేదకుండను
అక్కడే విడిచిపెట్టి మళ్లీ వస్తానంటూ నెలవు పుచ్చుకుంది.

*